క్లుప్తంగా

అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

పమిడిముక్కల: అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి ఎంఎస్ రాణి కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షం, గాలుల వల్ల ప్రమాదాలు జరిగితే వెంటనే సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. పీఎం సూర్యఘర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిఒక్కరూ ఇళ్లపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు, ఏపీఎం వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల సమీపంలోగల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో విజయవాడకు చెందిన మెడికేర్ ఆస్పత్రి వైద్య బృందం ఈ శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణారెడ్డి, డాక్టర్ లక్ష్మీ శ్రీలేఖ, డాక్టర్ అజయ్, డాక్టర్ సాగర్, క్లబ్ కార్యదర్శి డి. శ్రీనివాసరావు, కోశాధికారి టి. రామ్మోహన్ రావు, జిల్లా గవర్నర్ ఎలక్ట్ ఎల్ఈ వెంకటేశ్వర రావు, పి.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాను అభివృద్ధి చేస్తాం



గుడివాడ టౌన్: కృష్ణా జిల్లాను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం స్థానిక గుడివాడ క్లబ్‌లో నియోజకవర్గ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా జిల్లాను తమ ప్రభుత్వం హయాంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. గుడివాడ నియోజకవర్గంలో రోడ్లు, కాల్వల మరమ్మతులు తదితర అంశాలను స్థానికులు మంత్రుల దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఆక్వారైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంత్రుల దృష్టికి తీసుకురాగా దీనిపై సీఎంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పెడన, పామర్రు ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, ఆర్డీఓ బాల సుబ్రహ్మణ్యం, కమిషనర్ ఎస్.మనోహర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి



పామర్రు: పామర్రులో మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు జేసీ గీతాంజలి శర్మను కోరారు. మండలంలోని ఐనంపూడి గ్రామానికి బుధవారం వచ్చిన జేసీతో రైతులు మాట్లాడారు. ప్రస్తుతం మినుము ధర రోజు రోజుకూ తగ్గిపోతోందన్నారు. దళారులు సైతం రోజుకో రేటు చెబుతూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. అందువల్ల మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. జేసీ స్పందిస్తూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాసు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ద్వారా అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ, అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ పీడీ ఎంఎస్.రాణి బుధవారం తెలిపారు. జిల్లాలో రెండు అంగన్‌వాడీ పోస్టులు, ఒక మినీ అంగన్‌వాడీ పోస్టుతో పాటు 51 అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులను రోస్టర్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నిర్ణయించామన్నారు. జిల్లాలోని బందరు, బంటుమిల్లి, పామర్రు, గుడివాడ, కంకిపాడు, మొవ్వ, గన్నవరం, అవనిగడ్డ ప్రాజెక్టుల పరిధిలో ఈ పోస్టులు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత సీడీపీవో ఆఫీసును సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల వయసు 21 నుంచి 31 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత పొంది వివాహితై ఉండాలని, మిగిలిన వివరాల కోసం సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ అధికారులను సంప్రదించాలని ఆమె సూచించారు.

గాలి వాన బీభత్సం



తోట్లవల్లూరు లంకలో పడిపోయిన అరటి చెట్లను చూపుతున్న రైతులు



వల్లూరుపాలెం లంకలో తడిసి ముద్దయిన పసుపు

- తోట్లవల్లూరు మండలంలో పడిపోయిన అరటి, మొక్కజొన్న
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- అంధకారంలో గ్రామాలు

తోట్లవల్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. రాత్రి 9 నుంచి 10 గంటల వరకు ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భార వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు విద్యుత్ సరఫరా నిలిపి వేయటంతో గ్రామాలు అంధకారంలో చిక్కుకున్నాయి.

వాహన రాకపోకలకు అంతరాయం

మండలంలోని పలు రహదారులపై చెట్లు పడిపోవటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చిమ్మ చీకట్లో ఉరుములు, మెరుపుల వాన మధ్య జనం బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈదురుగాలుల తీవ్రతకు లంకల్లోని అరటి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. చేతికొచ్చిన మొక్కజొన్న, కోతకొచ్చిన అరటి పంటలు పడిపోవటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తడిసిన పంటలతో నష్టం

కల్లాల్లో ఆరబెట్టిన పసుపు, ధాన్యం, మొక్కజొన్న పంటలు వర్షం ధాటికి తడిసిపోయాయి. పరదాలతో కప్పినప్పటికీ కింద నుంచి వర్షం నీరు వెళ్లటంతో ఆయా పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో ఇలా ప్రకృతి విరుచుకుపడితే వ్యవసాయం ఎలా చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటలను గుర్తించి తగిన నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్రను చదువుతున్న విద్యార్థి



జమీగొల్వేపల్లిలో పుస్తక పఠనం



గుడ్లవల్లేరులో చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మండవల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని లైబ్రేరియన్ ఎస్కే పర్వీన పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్ర చదివి వినిపించారు. అనంతరం పిల్లలకు డిక్టేషన్ కండక్ట్ చేశారు. స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్ర ద్వారా పిల్లల్లో సృజనాత్మకత వెలికి తీయవచ్చన్నారు.

జమీగొల్వేపల్లిలో..

జమీగొల్వేపల్లి(పామర్రు): పుస్తక ప్రదర్శనతో పలు గ్రంథాల పరిచయం ఏర్పడుతుందని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా పుస్తక ప్రదర్శనను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్ర గ్రంథాలు, చిల్డ్రన్స్ నాలెడ్జ్ బుక్స్, బాల సాహిత్యం, విజ్ఞాన సర్వస్వాలు, వేమన-సుమతీ శతకాలు, జనరల్‌నాలెడ్జి, పోటీ పరీక్షలకు సంబంధించిన గ్రంథాలు ప్రదర్శనగా ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నిమ్మగడ్డ మాధవి, యోగా గురువు పి.వెంకట ధర్మారావు, పద్మావతి పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయశ్రేణి గ్రంథాలయంలో విద్యార్థుతో పద్యాలు చెప్పించడం, కథలు చదివించినట్లు గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయాల్లో ఆటల పోటీలు నిర్వహించినట్లు అంగలూరు, గుడ్లవల్లేరు లైబ్రేరియన్లు పి.వి.వి.పద్మజ, వాణి తెలిపారు. బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన పోటీలతో పాటు ఆటల, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు సుమతీ శతక పద్యాల గురించి వివరించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి విద్యార్థులతో శతక పద్యాలను చదివిస్తూ అందులోని భావాన్ని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం చెస్, క్యారమ్స్ ఆటలు ఆడించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

ముదినేపల్లి రూరల్: మండలంలోని ఊటుకూరు శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారి తిరుకల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఈ ఉత్సవాలు ప్రారంభం కాగా స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. బుధవారం ఉదయం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించి కల్యాణ తంతు జరిపించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

కైకలూరులో..

కైకలూరు: గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాల్లో భాగంగా కలిదిండి, కోరుకొల్లు బ్రాంచి గ్రంథాలయాల్లో చిన్నారులకు పుస్తక పఠనంతోపాటు చదరంగం, మ్యూజికల్స్ చైర్స్, స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. గ్రంథాలయాధికారులు రమేష్, రాఘవులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయంపై ఎమ్మెల్యేల హర్షం

గుడివాడరూరల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో భారత్ సత్తా ఏంటో మరోసారి ప్రపంచానికి తెలిసిందని గుడివాడ, పెడన ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలోని ప్రజా వేదికలో బుధవారం ఎమ్మెల్యేలు మీడియాలో వచ్చిన కథనాలను చూసి ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. సాధారణ పౌరులకు హానీ కలగకుండా దాడులు చేసిన భారత్ ఆర్మీకు అభినందనలు తెలిపి జై భారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గుడివాడ మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టీడీపీ పట్టణాధ్యక్షుడు రాంబాబు, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

10నుంచి చెన్నకేశవాలయ వార్షికోత్సవాలు

గుడ్లవల్లేరు: కౌతవరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ దేవస్థాన వార్షిక కల్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. బుధవారం ఆలయానికి రంగులను వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ఈ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

12న మెగా అప్రెంటీస్ మేళా

గుడివాడ టౌన్: ప్రధానమంత్రి అప్రెంటీస్ మేళాను ఈ నెల 12వ తేదీన గుడివాడ కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఐటీఐ పాసై అప్రెంటీస్ కోసం ఎదురు చూస్తున్న యువతీ యువకులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ మేళాకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 08674-295953లో సంప్రదించవచ్చని ఆమె పేర్కొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

నందివాడ: మండలంలోని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసే ప్రక్రియ ప్రారంభమైందని ఏఓ ఎస్.భానుప్రకాష్ బుధవారం తెలిపారు. భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులను వ్యవసాయ శాఖ గుర్తించి, వివరాలను వీఆర్వోలకు అందజేస్తుందని పేర్కొన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో సాగు భూమి వివరాలు సేకరించి విస్తీర్ణం, కౌలుదారు, యజమాని తదితరాలను ఆన్‌లైన్లో నమోదు చేస్తారని తెలిపారు. దీని ఆధారంగా గుర్తింపు కార్డు జారీ అవుతుందని పేర్కొన్నారు. పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగ, జనుము 50 శాతం రాయితీతో రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

చెరువును గ్రామానికి ఇప్పించాలి

ఐనంపూడి(పామర్రు): గతంలో పంచాయతీ ఎస్టీ సొసైటీకి లీజుకు ఇచ్చిన ఆది ఆంధ్ర పాత మాలపల్లి చెరువును పంచాయతీకి ఇప్పించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ భట్టు పరంజ్యోతి జేసీ గీతాంజలి శర్మకు బుధవారం అర్జీని సమర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ఆది ఆంధ్ర చెరువు తమ గ్రామ పూర్వీకుల ఆధీనంలో ఉండేదన్నారు. తర్వాత ఆ చెరువును పంచాయతీ ఎస్టీ సొసైటీకి లీజుకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పంచాయతీ ఆదాయం తక్కువగా ఉండటం వలన, ఎస్సీ సొసైటీ వారు చెరువుకు ఇచ్చే ఆదాయం సరిపోవడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్టీ సొసైటీ వారికి ఇచ్చిన లీజును రద్దుచేసి ఆ చెరువును పంచాయతీకి అప్పగించాలని కోరారు.

రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

మొవ్వ: మండలంలోని 16 సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ కే మస్తాన్ బుధవారం తెలిపారు. సచివాలయాల్లో రైస్ కార్డ్స్ సంబంధించిన ఏడు సేవలు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త బియ్యం కార్డు కోసం దరఖాస్తు, బియ్యం కార్డులో సభ్యుని చేరిక, కార్డు విభజన, కార్డులో సభ్యుల తొలగింపు, చిరునామా మార్పు, బియ్యం కార్డు, రైస్ కార్డులో ఆధార్ సీడింగ్, తప్పుగా ఉంటే సరి చేయటం ఇలాంటి సేవలు ప్రారంభమైనట్లు తెలిపారు.

పామర్రులో..

పామర్రు: ఏడు రకాల రైస్‌కార్డు సేవలను పునః ప్రారంభించినట్లు తహసీల్దార్ జీ రవికాంత్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కొత్త రేషన్‌కార్డు, రేషన్ కార్డులో సభ్యుల జోడింపు, కార్డు విభజన, కార్డునుంచి సభ్యుల తొలగింపు, రైస్‌కార్డు సరెండర్, రైస్ కార్డులో చిరునామా మార్పు, కార్డులో తప్పు ఆధార్ సీడింగ్ దిద్దుబాటు తదితర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇళ్ల స్థలాలు కావాలనుకునే వారు కూడా సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే వెసులు బాటు కూడా కల్పించనట్లు ఆయన పేర్కొన్నారు.

నందివాడలో..

నందివాడ: మండలంలో కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ఎన్.గురుమూర్తి రెడ్డి తెలిపారు. కార్డుల్లో మార్పులు, చేర్పులు కూడా చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

● పంచాయతీ అవకతవకలపై విచారణ

కైకలూరు: పంచాయతీ సిబ్బంది ప్రమేయంతో కార్యదర్శి ఆనందభూషణం అవకతవకలకు పాల్పడ్డారని సర్పంచ్ దానం మేరీ నవ రత్నకుమారి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో నూజివీడు సమీపం తుక్కులూరులో నూజివీడు డీపీఓ సుందరి బుధవారం విచారణ చేపట్టారు. విచారణలో సర్పంచ్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ సిబ్బంది గంటా రమేష్, సమ్మెట జగదేశ్వరరావు ప్రమేయంతో కుళాయిల పన్నులు, షాపుల అద్దెలు సుమారు రూ.40 లక్షలు వసూలు చేయించి పంచాయతీ ఈఓ స్వప్రయోజనాలకు వినియోగించారని ఆరోపించారు.

● భారీ వర్షం

పమిడిముక్కల: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంకురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. రహదారులపై వర్షం నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

● గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు, కూరాడలో బుధవారం భారీ వర్షం కురిసింది. రోడ్లపై నిలిచిన వర్షం నీటితో వాహన చోదకులు ఇబ్బందులుపడ్డారు.

● యుద్ధం వస్తే జాగ్రత్తలపై అవగాహన

ముదినేపల్లి రూరల్: భారత్-పాక్ మధ్య యుద్ధ వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ వీరభద్రరావు ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక గురజ రోడ్డులో బుధవారం యుద్ధ వాతావరణం నేపథ్యంలో జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. వైమానిక దాడులు సంభవిస్తే తీసుకోవాల్సిన ఆత్మ రక్షణ చర్యల గురించి సిబ్బందితో ప్రయోగాత్మకంగా వివరించారు.

● ఆకట్టుకున్న వార్ మాక్‌డ్రిల్

కైకలూరు: భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధవాతావరణం నేపథ్యంలో స్థానిక శ్యామలాంబ దేవస్థాన ఆవరణలో పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, ఆరోగ్యం, ఎలక్ట్రికల్, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్ బుధవారం అందరినీ ఆకట్టుకుంది. తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం, కైకలూరు రూరల్, టౌన్ సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ, సీహెచ్‌సీ డాక్టర్ కీర్తి, ఎస్ఐలు శ్రీనివాస్, వెంకట్ కుమార్, వెంకటేశ్వరరావు, రాంబాబు, రామచంద్రరావు, వీరభద్రరావు, ఆర్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● చెత్త వేరు చేసే విధానం పరిశీలన

మండవల్లి: పంచాయతీ పరిధిలో చెత్త వేరు చేసే విధానాన్ని సర్పంచ్ మెండా ఝాన్సీ బుధవారం పరిశీలించారు. పాడి చెత్తను ట్రక్కులో పోయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



గుడివాడలో సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న క్షత్రియ సేవాసమితి సభ్యులు



కోసూరులో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్షత్రియ సంఘం సభ్యులు

గుడివాడ టౌన్: మన్యందొర, స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి బుధవారం నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి గుడివాడ క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు కె. కామరాజు, గౌరవాధ్యక్షుడు జి. జగ్గరాజు, కోశాధికారి కె. శ్రీనివాసరాజు, నాయకులు విజయ్‌కుమార్‌రాజు, దామోదర్‌రాజు, అల్లూరి సీతారామరాజు స్మారక కమిటీ చైర్మన్ ఎస్. ఉదయ్‌భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

కోసూరులో..

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరులో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చిందా వీర వెంకట నాగేశ్వరరాజు, మహాశి నాగరాజు, పామర్రు నియోజకవర్గ సీపీఐ సమితి సహాయ కార్యదర్శి కోసూరు వెంకట అప్పారావు, అబ్దుల్ సలాం, పి గంగరాజు, బి. శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జన్మదినం



తోట్లవల్లూరులో పూజలందుకున్న అమ్మవారు



గుడ్లవల్లేరులో అమ్మవారి గ్రామోత్సవం



గుడివాడలో నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు



మొవ్వలో నిర్వహించిన పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

గుడివాడ టౌన్: స్థానిక వాసవిచౌక్‌లో వేంచేసియున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ వాసవీదేవి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి ఆలయ పాలకవర్గం పట్టుచీర సమర్పించగా ఆలయ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు పతాక ఆవిష్కరణ చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి నగరోత్సవం జరిగింది.

మొవ్వలో..

మొవ్వ: వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి పుట్టిన రోజును స్థానిక ఆర్యవైశ్యులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి పువ్వాడ సురేష్, గ్రామస్తులు వెంకట నాగరమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు బుధవారం జరిగాయి. ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం విప్రనారాయణ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ తాడికొండ ఉదయ సూర్య సుధాకర్, మనోరమ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి పంచాయన క్షేత్రంలో అమ్మవారికి బుధవారం రాత్రి ఊరేగింపు నిర్వహించారు. తొలుత అమ్మవారి జన్మదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కైకలూరులో..

కైకలూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి పుట్టిన రోజు వేడుకను బుధవారం నిర్వహించారు. ఉదయం పొన్నూరి బ్రాహ్మజీ దంపతులతో కలశస్థాపన నిర్వహించారు. అనంతరం 102 మంది ముత్తైదువులతో సహస్రనామ పూజ చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు చొప్పర్ల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొప్పర్తి కృష్ణమూర్తి, కోశాధికారి రాజా పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

గుడివాడ టౌన్: బహుజనులకు రాజ్యాధికారమే బీఎస్పీ అంతిమ లక్ష్యం అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎన్జీవోస్ హోమ్ సమీపంలోని బీఎస్పీ కార్యాలయంలో బుధవారం బహుజన సంకల్పసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ అవనిగడ్డ నియోజకవర్గం కొడాలి గ్రామం సెంటర్‌లో బహుజన సంకల్ప సభ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బి. గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు జరిగే ఈ సభకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నాయకులు పాల్గొంటారన్నారు. కావున బీఎస్పీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మరియబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత



తప్పిపోయిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించిన రైల్వే, బేతనచర్ల పోలీసులు

గుడివాడరూరల్: తప్పిపోయిన వ్యక్తిని తిరిగి కుటుంబ సభ్యులకు రైల్వే పోలీసులు అప్పగించిన సంఘటన బుధవారం జరిగింది. రైల్వే ఎస్ఐ మహబూబ్ షరీఫ్ కథనం మేరకు ఈనెల 6వ తేదీన గుడివాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా 30-35 సంవత్సరాల వయస్సుగల వ్యక్తిని అనుమానంతో విచారించారు. అతను తన పేరు ముల్లా అబ్దుల్ తౌఫిక్ అని బేతంపేట నంద్యాల జిల్లా అని చెప్పాడు. ఈక్రమంలో ఆ వ్యక్తి ఆచూకీపై బేతనచర్ల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులు, అక్కడి పోలీసులు గుడివాడ రైల్వే పోలీస్‌స్టేషన్ వచ్చారు. సదరు వ్యక్తిని అక్కడి పోలీసులకు అప్పగించడంతో వారు కుటుంబ సభ్యులకు అప్పగించారని రైల్వే ఎస్ఐ తెలిపారు.

టిడ్కో కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తాం

గుడివాడ టౌన్: టిడ్కో కాలనీలో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు ప్రధానాంశంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావుతో కలిసి టిడ్కో కాలనీలో పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఏసుబాబు, డీఈఈ సతీష్‌చంద్ర పాల్గొన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనా మహోత్సవాలు



గుడివాడ టౌన్: జగద్గురు, కాలజ్ఞాని శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. స్థానిక శ్రీనివాస సెంటర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలోను, బంటుమిల్లి రోడ్ శ్రీనివాస సెంటర్‌లో ఏర్పాటు చేసిన పందిరిలో ఆరాధనా మహోత్సవాలు 10 రోజులు నిర్వహించారు. కె. వీరబోగ వసంతరాయ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ముగింపు కార్యక్రమంలో పాల్గొని వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యదర్శి ఆర్. సురేష్‌బాబు, ఎ. పిచ్చేశ్వరరావు, వై. కోటేశ్వరరావు, సీహెచ్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.